సీఎం కేసీఆర్ షెడ్యూల్‌లో స్వల్ప మార్పు

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం కేసీఆర్ నిర్వహిస్తున్న ప్రజాఆశీర్వాద సభల షెడ్యూల్‌లో స్వల్ప మార్పు జరిగింది. నూతన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 26న అచ్చంపేట, వనపర్తి, మునుగోడులో నిర్వహించే సభల్లో సీఎం పాల్గొననున్నారు. 27న పాలేరు, మహబూబాబాద్, వర్ధన్నపేటలో సీఎం కేసీఆర్ సభలు జరుగనున్నాయి. మిగతా సభలు యథావిధిగా ఉంటాయి.

లండన్‌లో బతుకమ్మ, దసరా సంబురాలు

హైదరాబాద్, అక్టోబరు 24 (నమస్తే తెలంగాణ): తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ యునైటెడ్ కింగ్ డమ్ (టాక్) ఆధ్వర్యంలో లండన్‌లో చేనేత బతుకమ్మ – దసరా సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు యూకే నలుమూలల నుంచి 3 వేలకు పైగా ఎన్నారై కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా స్థానిక ఎంపీ సీమ మల్హోత్రా (లేబర్ పార్టీ షాడో మినిస్టర్), హౌంస్లా మేయర్ అఫ్జాల్ కియాని, కౌన్సిలర్ ఆదేశ్ ఫార్మ హాన్ హాజరయ్యారు. ఈ సంవత్సరం కూడా బతుకమ్మ దసరా వేడుకలను 'చేనేత బతుకమ్మ, దసరా' గా జరుపుకున్నట్టు ఎన్నారై బీఆర్ఎస్ యూకే అధ్యక్షుడు, టాక్ నేషనల్ కన్వీనర్ అశోక్‌గౌడ్ దూసరి తెలిపారు. టాక్ కార్యవర్గానికి అన్ని సందర్భాల్లో ఎమ్మెల్సీ కవిత వెన్నంటి ప్రోత్సహిస్తున్నారని, టాక్ తల పెట్టిన ప్రతీ కార్యక్రమాన్ని ఎంతో విజయవంతం చేశామని చెప్పారు. కార్యక్రమంలో టాక్ అడ్వయిజరీ బోర్డు చైర్మన్ మట్టారెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేశ్ బుడగం, కార్యదర్శులు రవి రేతినేని, సుప్రజ పులుసు, గణేశ్ కుప్పాల, ఉపాధ్యక్షుడు శుష్మణ రెడ్డి, ఈవెంట్స్ ఇన్‌చార్జి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి 10 లక్షల విరాళం

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): తిరుమల శ్రీవారికి గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌కు చెందిన వికాస్‌కుమార్ కిశోర్‌భాయ్ రూ.10 లక్షల విరాళం అందజేశారు. ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టు కోసం డీడీని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డికి ఇచ్చారు. అనకాపల్లి ఎస్పీ కేవీ మురళీ కృష్ణ రూ.2 లక్షల విలువైన కూరగాయలు అందించారు. శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిశాయని చైర్మన్ భూమన తెలిపారు.

కాంగ్రెస్ గెలుపు కోసం దేశమే పణం

- దేశం నాశనమైనా తాను గెలువాలన్నదే ఆ పార్టీ నైజం
- ఎన్నికల కోసం కాంగ్రెస్ ఎంతకైనా దిగజారుతున్నది
- అభివృద్ధి, సంక్షేమం జోడెడ్లుగా తెలంగాణలో పాలన
- ముఖ్యమంత్రి కేసీఆర్ సర్కారు అభివృద్ధి నమూనా ఆదర్శం
- నూటికి నూరుశాతం బీఆర్ఎస్‌ను అభినందించాల్సిందే
- విభజన తర్వాత అందరినీ సమదృష్టితో చూస్తున్న కేసీఆర్
- మంత్రి కేటీఆర్‌కు రాజకీయాల్లో అపార అనుభవం
- మంత్రి కేటీఆర్‌తో ఇష్టాగోష్ఠిలో జయప్రకాశ్ నారాయణ

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్‌తో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ ఇష్టాగోష్ఠి

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): ఎన్నికల్లో గెలుపుకోసం కాంగ్రెస్ పార్టీ దేశ భవిష్యత్తును పణంగా పెడుతున్నదని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ ఆవేదన వ్యక్తంచేశారు. 'నేను చాలా బాధతో ఈ మాట చెప్తున్నాను. కాంగ్రెస్ నాయకులతో అగ్రస్థాయిలో నాకు మంచి సంబంధాలున్నాయి. నేను జాతీయ సలహా మండలిలో పనిచేశాను. పరిపాలనా సంస్కరణ సంఘంలో పనిచేశాను. ఇవాళ కాంగ్రెస్ పార్టీ భయానికి గురై.. ఎన్నికల్లో గెలిచేందుకు దేశ భవిష్యత్తును కూడా పణంగా పెట్టే పరిస్థితికి వచ్చింది. నేను ఆవేదనతో చెప్తున్నా.. ఆ పార్టీ అనేక చర్యలు అలానే ఉన్నాయి. ఉదాహరణకు ఓల్డ్ పెన్షన్ స్కీం (ఓపీఎస్)పై కేసీఆర్‌గారు పరిశీలించి అటు ప్రజలకు, ఉద్యోగులకు న్యాయం అయ్యేట్టు చేద్దామన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ కేవలం ఎన్నికల్లో గెలుపు కోసం ఓపీఎస్ ఇచ్చేస్తామని చెప్పింది. కొన్ని కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఓపీఎస్‌ను అమలుచేస్తున్నారు. బ్యాలన్స్ తీసుకురాకపోతే కచ్చితంగా ఆ రాష్ట్రాలు నాశనమైపోతాయ్' అని వ్యాఖ్యానించారు. 'మన చర్యలవల్ల దేశమే ఓడిపోయే టట్టైతే ఎవరు గెలుస్తారని సాక్షాత్తూ నెహ్రూ చెప్పారు. నేను గెలవడంకోసం దేశం సర్వనాశనం అయిపోయినా ఫర్వాలేదనే పరిస్థితి తేవడం ప్రమాదకరమని అన్నారు' అని జేపీ గుర్తు చేశారు. నేడు నిరాశతో ఉన్న వర్గాలకు ఉత్సాహాన్ని, నమ్మకాన్ని కలిగించాల్సిన అవసరం ఉన్నదని, దీర్ఘకాలంలో ఆదాయాలు పెరిగి, ఉపాధి కల్పన జరిగే ఏర్పాట్లు లేకుంటే రాష్ట్ర, దేశ భవిష్యత్తు అంధకారమవుతుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ మంగళవారం ఓ టీవీ చానల్‌లో జేపీతో ఇష్టాగోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధి, దేశ, రాష్ట్ర రాజకీయాలు, ఎన్నికలు తదితర అంశాలపై కేటీఆర్ అడిగిన ప్రశ్నలకు జేపీ తనదైన శైలిలో సమాధానం ఇచ్చారు.

అందరినీ సమభావంతో చూస్తున్న కేసీఆర్

తెలంగాణలో అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజలను సమభావంతో చూస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందని జేపీ కొనియాడారు. ఉద్యమం సందర్భంగా నెలకొన్న అన్ని రకాల సందేహాలు, భయాలను కేసీఆర్ పటాపంచలు చేశారని ప్రశంసించారు. కేంద్రంలో ఆర్థిక పరిస్థితి 'పైన పటారం.. లోన లొటారం'లా ఉన్నదని చెప్పారు. తెలంగాణ ఉద్యమం సందర్భంగా నెలకొన్న సందేహాలు, భయాలపై సమాధానమిస్తూ.. ఉద్యమం సందర్భంగా తనపైనే అధికంగా ఒత్తిడి ఉండేదని జేపీ చెప్పారు. తెలంగాణ పర్యటనలో అంతా 'జై తెలంగాణ' అనాలనే డిమాండ్లు వచ్చేవని, ఆంధ్రా ప్రాంతంలో 'సమైక్యాంధ్ర' అనాలని ఒత్తిడి తెచ్చేవారని గుర్తుచేశారు. ఆంధ్రా, తెలంగాణ కలిసుంటే మంచిదని, ఒకవేళ విడిపోవాల్సి వస్తే సామరస్యంగా విడిపోవాలనే తాను కోరుకున్నట్టు చెప్పారు. ఉద్యమం సందర్భంగా హైదరాబాద్‌పై అనేక సందేహాలు, భయాలు ఉండేవని, వాటిని పటాపంచలు చేస్తూ అందరినీ సమానంగా ఆదరిస్తున్నారని కొనియాడారు. హైదరాబాద్ కాస్మో పాలిటన్ కల్చర్ దేశ ఐక్యతకి ప్రతీకగా ఉన్నదని, అందరినీ సమానంగా ఆదరించడం ద్వారా ఈ సంస్కృతిని మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేసిందని చెప్పారు. ఇది మనందరికీ గర్వకారణమని, ఎలాంటి భేదభావాలు లేకుండా చేయడం తెలంగాణ ప్రభుత్వానికి, ఇక్కడి నాయకత్వం ఘనతేనని కొనియాడారు.

సమతూకంగా అభివృద్ధి, సంక్షేమం

కేసీఆర్ పాలనలో అభివృద్ధి, సంక్షేమంపై జేపీ మాట్లాడుతూ ఆర్థికాభివృద్ధిని, సంపద సృష్టిని ఆపకూడదని, అదే సమయంలో సంక్షేమం ద్వారా సామాన్యుడిని ఆదుకోకుంటే ప్రజాస్వామ్యం నడవదని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం ఈ సమతూకాన్ని పాటించే ప్రయత్నాలు విజయవంతంగా చేసిందని అభినందించారు. కేసీఆర్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజల్లో సామరస్యాన్ని పెంచడంతో పాటు హైదరాబాద్ నగరాన్ని మరింత వేగంగా, సమర్థవంతంగా అభివృద్ధి చేసిందని చెప్పారు. పెట్టుబడిదారుల్లో నమ్మకం కలిగించడంలో సఫలమయ్యారని పేర్కొన్నారు. చాలామంది ఉత్తరాదివారు కూడా హైదరాబాద్‌లో ఆస్తులు కొంటున్నారని, ఇది ఎంతో గర్వించాల్సిన విషయమని చెప్పారు. అర్బన్ డెవలప్‌మెంట్ అనేది ఎంతో క్లిష్టమైనదని, మన దేశంలో పెట్టుబడి పెట్టి సంపద సృష్టిస్తే అది పాపం చేశారనే భావన ఎంతో కాలంగా ఉందని అన్నారు. పదిమందికి ఉపాధి కల్పించేవాడు దేవుడని, ఆత్మవిశ్వాసాన్ని, సంపదను పెంచి, ఆదాయాన్ని తెచ్చేవాడు దేవుడని, అటువంటివాళ్లకు ఇప్పుడు గౌరవం లభిస్తున్నదని తెలిపారు. ఇంతకాలం వాళ్లను పురుగుల్లా చూశారని ఆవేదన వ్యక్తంచేశారు. సమాజంలో రిస్క్ తీసుకొని తాను కొంత సంపాదించి, నలుగురికి ఉపాధి చూపించేవాడు దేశానికి అవసరమని చెప్పారు. దానికోసం మౌలిక సదుపాయాలు, అర్బనైజేషన్, స్కిల్ డెవలప్‌మెంట్ అవసరమని, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రెండ్లీ క్లైమేట్ ఉండాలని, ఇవి లేకుండా ప్రభుత్వ ఉద్యోగులవల్ల దేశం బాగుపడుతుందనే భ్రమ నుంచి బయటపడాలని సూచించారు. తెలంగాణలో ఒక ప్రోయాక్టిక్ వాతావరణాన్ని ఏర్పాటు చేశారని కితాబిచ్చారు.

కేంద్రం దగ్గర డబ్బులు లేవు!

రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం నుంచి రావాల్సిన సహకారంపై కేటీఆర్ అడిగిన ప్రశ్నకు జేపీ సమాధానమిస్తూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుందని చెప్పారు. కేంద్రం దగ్గర డబ్బు లేదని, దేశ ఆర్థిక పరిస్థితి చాలా దారుణంగా ఉన్నదని తెలిపారు. రూ. 33లక్షల కోట్లు బడ్జెట్‌లో ఆదాయం వస్తుంటే, 18 లక్షల కోట్లు రాష్ట్రాలకు పోతున్నాయని, రూ.10 లక్షల కోట్లు వడ్డీలకు, రూ.8లక్షల కోట్లు జీతభత్యాలకు ఖర్చవుతున్నాయని, ఒక్క పని కూడా చేసే పరిస్థితి లేదని వివరించారు. తెలంగాణ సర్కారు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెంచేందుకు కృషిచేయడం అభినందనీయమని అన్నారు. నగరాలు, పట్టణాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేయాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. హైదరాబాద్‌తో పాటే ఇతర పట్టణాలు కూడా పెరగాలని, రవాణా పెంచితే గొప్ప విజయవంతమైన తెలంగాణగా ఎదుగుతుందని చెప్పారు.

> హైదరాబాద్ పచ్చగా ఉంది.. వివిధ ప్రాంతాలనుంచి లక్షలాదిమంది వచ్చి ఇక్కడ ఉంటున్నారు. వారికి భద్రత ఉంటుందా? రేపు వివక్ష ఎదురవుతుందా? శాంతిభద్రతల సమస్య ఏమైనా ఏర్పడుతుందా? అనే భయాలు ఉద్యమ సమయంలో ఉండేవి. ఈ విషయంలో బీఆర్ఎస్‌ను నూటికి నూరు పాళ్లు అభినందించాల్సిందే. ఆంధ్రా, తెలంగాణ అనే భావన లేకుండా నిండు మనసుతో పరిపాలన చేస్తున్నారు.
>
> -జయప్రకాశ్ నారాయణ

విద్యుత్తు కొరత లేకుండా చేయడం ఎంతో గొప్ప విషయమని ప్రశంసించారు.

అభివృద్ధి ఆధారంగా గెలుపుపై గ్యారెంటీ లేదు!

మన దేశంలో అభివృద్ధి ఆధారంగా గెలుపొందుతామనే గ్యారెంటీ లేదని, చాలా రంగాల్లో వైఫల్యాలవల్ల ఎంతో మంది పేదరికంలో ఉండిపోవడమే దీనికి ప్రధాన కారణమని చెప్పారు. ప్రపంచంలోని ఇతర దేశాల్లో 7 లేదా 8 శాతం అభివృద్ధి ఉంటే ఆ ప్రభుత్వం మళ్లీ గెలవడం గ్యారెంటీ అని, ఇండియాలో ఆ గ్యారెంటీ లేదని తెలిపారు. నైపుణ్యం, మోటివేషన్ లేకుండా ఉండడం వల్ల ప్రభుత్వాలు ఏమిచేసినా చాలామంది ప్రజలకు కావాల్సిన ప్రయోజనం లభించడంలేదని చెప్పారు. ఇలాంటివారు ఇప్పటికీ పెద్ద సంఖ్యలో ఉన్నారని అన్నారు. ఆ నమ్మకం లేనప్పుడు గ్రోత్ రేట్ ఒక్కటే సరిపోదని, సంక్షేమం వద్దంటే ప్రజాస్వామ్య దేశంలో రాజకీయాలు నడవవని చెప్పారు. అమెరికా వంటి దేశాల్లో సైతం వివిధ రూపాల్లో సంక్షేమ పథకాలు కొనసాగుతున్నాయని తెలిపారు. అయితే, సంక్షేమమే పరిపాలన అనుకోవడం సరికాదని అన్నారు.

తెలంగాణలో భూములకు రెక్కలు

తెలంగాణ పుణ్యమా అని రాష్ట్రంలో భూముల ధరలు బాగా పెరిగాయని జేపీ పేర్కొన్నారు. పూర్వీకులు సంపాదించిన ఆస్తులున్నవాళ్లు వందల కోట్లు సంపాదిస్తున్నారని చెప్పారు. రాజకీయంలో గెలిస్తే.. ఓ విజన్‌తో ఏదో చెయ్యొచ్చని కొందరు భావిస్తుంటారని, ఇంకొందరు డబ్బు ద్వారా రాజకీయాల్లోకి రావాలని చూస్తుంటారని అన్నారు. దీని వల్ల తలకుమించిన ఖర్చు చేసి కుటుంబాలను ఆగం చేసుకుంటున్నారని, ఎన్నికల వేళ ఖర్చు తగ్గించే మార్గాలపై దృష్టిపెట్టాలని సూచించారు. ఎలక్ట్రోరల్ ఖర్చును తగ్గించాలని, అందుకు రాజకీయ పార్టీల నాయకులను కూర్చోబెట్టి మాట్లాడేందుకు తాను ప్రయత్నిస్తానని చెప్పారు. ఎందుకంటే డబ్బులిస్తేనే ఓటేస్తామనే స్థితికి కొందరు ఓటర్లు వస్తే.. నాయకులు కూడా ఎన్నికల్లో ఓడిపోవడం కంటే.. చనిపోవడం మేలనుకునేలా తయారవుతున్నారని అన్నారు.

చిన్న వయసులో కేటీఆర్‌కు అపార అనుభవం

చిన్నవయసులోనే మంత్రి కేటీఆర్‌కు రాజకీయాలపై అపారమైన అనుభవం వచ్చిందని జేపీ అభినందించారు. 'మీరు అనుకోని పరిస్థితుల్లో.. ఉద్యమ నేపథ్యంలో రాజకీయాల్లోకి వచ్చారు. మంత్రిగా ప్రత్యేకించి వెల్త్ క్రియేషన్, అర్బన్ మేనేజ్‌మెంట్ చేశారు. మొత్తంగా అభివృద్ధివైపు రాష్ట్రాన్ని తీసుకెళ్తున్నారు చాలా సంతోషం' అని కేటీఆర్‌నుద్దేశించి అన్నారు. ఎంతో తలనొప్పిగా ఉండే రాజకీయాలను సులువుగా కేటీఆర్ డీల్ చేసే విధానం గొప్పగా ఉంటుందని ప్రశంసించారు. ఇందుకు మంత్రి కేటీఆర్ స్పందిస్తూ.. అది తన తండ్రి నుంచి నేర్చుకున్నట్టు చెప్పారు. ప్రతిరోజూ తన తండ్రి నేర్పిన అలవాట్లలో భాగంగా 10-15 పేపర్ల చదువుతానని, ఓ మంత్రిగా, ఎమ్మెల్యేగా సర్పంచ్ నుంచి ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎమ్మెల్యేల సమస్యలు పరిష్కరిస్తూ.. ప్రజలతో కలిసి ఉంటూ.. రోజు ఎలా గడుస్తుందో తెలియకుండా ముందుకు సాగుతున్నట్టు చెప్పారు. 'నేను నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచాను. ఒక్క రూపాయి పంచలేదు. ఒక్క చుక్క మందు పొయ్యలేదు. ఎన్నికలు జీవన్మరణ సమస్య కాకూడదు. నాకునేను సమాధానం చెప్పుకోవాలి. పనిచేసి గెలిచానా..? పంచి గెలిచానా? అనేది నాకు చాలా ముఖ్యం' అంటూ మంత్రి కేటీఆర్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. డబ్బులు ఆశించకుండా.. చేసిన పనులు మాత్రమే చూసి గెలిపించిన తన నియోజకవర్గ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆలోచించి ఓటేయండి

ఎన్నికల నేపథ్యంలో అభివృద్ధి, సంక్షేమాన్ని బ్యాలెన్స్ చేసేవాళ్లకు మాత్రమే ఓటెయ్యాలని జయప్రకాశ్ నారాయణ కోరారు. 'మన దేశంలో 85శాతం మందికి రెక్కాడితే కానీ డొక్కాడని రోజులున్న నేపథ్యంలో ఎవరు మీ పిల్లలను కాపాడాతారో వారిని ఎన్నుకోండి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేవారిని, సంపాదన పెంచేవారిని ఎన్నుకోకపోతే ఎల్లకాలం పేదలు.. పేదలుగానే మిగిలిపోతారు. సినిమాల వల్ల, పత్రికల వల్ల అందరూ రాజకీయ దొంగలే అనుకుంటున్నారు. అయితే ప్రజలు ఒక్కటే ఆలోచించాలి. ఉన్న రాజకీయ నాయకుల్లో ఎవరు మంచి చేస్తారు? సంక్షేమాన్ని, అభివృద్ధిని ఎవరు అందిస్తున్నారు? ఎవరైతే పిల్లల విద్యపై దృష్టిపెట్టి వారిని బాగు చేస్తున్నారు? ఎవరైతే పెట్టుబడులు తీసుకొస్తారు? పరిశ్రమలను ఎవరు ప్రోత్సహిస్తారు? పిల్లలకు స్కిల్ డెవలప్‌మెంట్ చేసి, ఉపాధి అవకాశాలను ఎవరు పెంచుతారు? ప్రజారోగ్యంపై ఎవరు దృష్టిపెట్టారు? అనేది గమనించి వారికి మాత్రమే ఓటు వేసి ఆదరించండి. వాళ్లను మాత్రమే నమ్మండి' అని జేపీ ప్రజలను కోరారు.

కేసీఆర్ బీమా మరో చరిత్ర

మొదటిపేజీ తరువాయి...

పెన్షన్లు, రైతుబంధు, రైతుబీమా, దళితబంధు, చేనేత బీమా వంటి పథకాలే ఉదాహరణ. ఇవి లబ్ధిదారుల ఆర్థిక, సామాజిక, జీవన స్వరూపాన్ని మార్చేశాయి. రైతుబంధుతో వ్యవసాయం పండుగైతే, రైతుబీమాతో అన్నదాతల కుటుంబాలకు భరోసా దొరికింది. దళితబంధుతో నిరుపేద ఎస్సీలు వ్యాపారవేత్తలు, యజమానులుగా మారారు. ఆత్మగౌరవంతో బతుకుతున్నారు. ఇదే కోవలో ఇప్పుడు సీఎం కేసీఆర్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన పథకం.. 'కేసీఆర్ బీమా-ప్రతి ఇంటికి ధీమా'. ఈ పథకం ద్వారా దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి బీమా సదుపాయం కల్పిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నిలువనున్నది. ఈ మేరకు ఎన్నికల మ్యానిఫెస్టోలో ఈ పథకాన్ని పొందుపరిచారు. కుటుంబ యజమాని ఏదైనా ప్రమాదం వల్లనో, సహజంగానో మరణిస్తే వారంలోనే ఆ కుటుంబానికి రూ.5 లక్షలు అందనున్నాయి. సంపాదించి, కుటుంబాన్ని పోషించే ఇంటిపెద్దను కోల్పోయిన కుటుంబం కుంటుపడకుండా, ఆగం కాకుండా ఈ డబ్బు వారికి ఆసరాగా నిలువనున్నది. రాష్ట్రంలో 93 లక్షలకుపైగా కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. కేసీఆర్ బీమాతో 93 లక్షల కుటుంబాలకు భరోసా దక్కనున్నది.

సిరిసిల్ల జిల్లాకు చెందిన ఓ రైతు చనిపోతే ఆయన కుటుంబానికి రూ.5లక్షల రైతు బీమా చెక్కును స్వయంగా అందజేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారకరామారావు (ఫైల్)

ఇప్పటికే పలు వర్గాలకు బీమా అమలు

'ఒక రైతు ఏదైనా కారణం వల్ల మరణిస్తే ఆ కుటుంబం వీధిన పడొద్దు, అనాథగా మారొద్దు' అన్నదే రైతుబీమా అమలు వెనుక ఉద్దేశం. ఆ తర్వాత ఆ బీమా పథకాన్ని చేనేత, మత్స్యకారులకు కూడా ప్రభుత్వం వర్తింపజేసింది. ఇప్పటికే సుమారు 41 లక్షల మంది రైతులకు, 3.73 లక్షల మంది మత్స్యకారులకు, 36 వేల మంది చేనేత కార్మికులకు ప్రభుత్వం బీమా కల్పిస్తున్నది. మూడోసారి అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ బీమా సదుపాయం కల్పిస్తామని సీఎం కేసీఆర్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించారు. ఈ పథకం అమలుతో రాష్ట్ర ప్రభుత్వంపై అదరపు భారం పడుతుంది. అయినా సరే ప్రతి ఇంటికి ధీమా కల్పించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. దీంతో రాష్ట్రంలోని కోటికి పైగా కుటుంబాలకు బీమా రక్షణ అందనున్నది. పాలసీదారు సహజ మరణమైనా, వేరే ఏ కారణాల వల్ల మరణించినా రూ.5 లక్షలు ఆ కుటుంబానికి వారం పదిరోజుల్లోనే అందనున్నాయి. పెద్ద దిక్కును కోల్పోయిన ఆ కుటుంబాలకు ఆసరా కానున్నది. దేశ పాలనా రంగానికి తెలంగాణ మరోసారి దిక్సూచిగా మారనున్నది.

ప్రతి కుటుంబానికి ఎల్లవేళలా రక్ష

ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ ఇటీవల నిర్వహించిన సర్వే ప్రకారం.. దేశంలో లైఫ్ ఇన్సూరెన్స్ రెన్యువల్ చేసుకునే వారి సంఖ్య గణనీయంగా పడిపోతున్నది. గత ఏడాది జీవిత బీమా కలిగి ఉన్నవారిలో 47 శాతం మంది తమ పాలసీలను రెన్యువల్ చేసుకోలేదు. ఒకటి, రెండేండ్లు చెల్లించినా సంపాదన సరిపోకపోవటం, ఇతర ఖర్చుల భారం, బీమా కట్టాలని గుర్తులేకపోవడం, అదనపు ఖర్చుగా భావించడం వంటి అనేక కారణాతో బీమా చెల్లించడం లేదు. ఈ సమస్యకు కేసీఆర్ బీమా చెక్ పెట్టనున్నది. ఈ పథకం కింద ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుంది. దీంతో ప్రతి కుటుంబానికి పాలసీ ఖర్చు ఆదా అవడంతోపాటు బీమా రక్షణ అందనున్నది.

రైతుబీమా

ప్రారంభం: 2018-19
ఏటా ఖర్చు: రూ.20 కోట్లకు పైగా
ఒక్కొక్కరికి చెల్లించిన ప్రీమియం: రూ.3,800 చొప్పున (ఏటా)
మొదటి ఏడాది లబ్ధిదారులు – 31.25 లక్షల మంది రైతులు
2023-24లో లబ్ధిదారులు — 41.04 లక్షల మంది రైతులు
ఆరేండ్లలో ప్రభుత్వం చెల్లించిన మొత్తం ప్రీమియం: రూ.6,861 కోట్లు
ఇప్పటిదాకా బీమా సొమ్ము లబ్ధిదారులు: 1.08 లక్షల కుటుంబాలు
అందిన మొత్తం : రూ.5,402 కోట్లు (రూ.5 లక్షల చొప్పున)

చేనేత బీమా

ప్రారంభం : 2022 ఆగస్టు 7
ఒక్కొక్కరికి చెల్లించిన ప్రీమియం: రూ.5,426
లబ్ధిదారులు : 36 వేల మంది
బీమా సొమ్ము అందింది: 50 కుటుంబాలకు (రూ.5 లక్షల చొప్పున)

మత్స్యకారులకు బీమా

లబ్ధిదారులు: 3.73 లక్షల మంది
చెల్లించిన ప్రీమియం: రూ.1.50 కోట్లు (ఈ ఏడాది)

ప్రస్తుతం రైతు, చేనేత, మత్స్యకారుల బీమాలకు ప్రభుత్వం చేస్తున్న ఖర్చు: రూ.1,500 కోట్లు (ఏటా)
కోటి కుటుంబాలకు బీమా చెల్లించాలంటే అయ్యే ఖర్చు: రూ. 4-5 వేల కోట్లు (అంచనా-ఏటా)

ఎల్ఐసీకి జవసత్వాలు

> ప్రభుత్వ రంగ బీమా సంస్థ ఎల్ఐసీని కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్‌కు అమ్మేసి నిర్వీర్యం చేయాలని కంకణం కట్టుకున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే కొంత వాటాను అమ్మేసింది. బంగారు గుడ్లు పెట్టే ఎల్ఐసీని ప్రైవేట్ పరం చేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సంస్థను కాపాడాలని ప్రయత్నిస్తున్నది. ఒక్క రైతుబీమా ద్వారానే ఆరేండ్లలో రూ.6,861 కోట్ల ప్రీమియంను సంస్థకు చెల్లించింది.

ప్రస్తుతం అమలవుతున్న పథకాల్లో పాలసీదారులకు ఏమైనా జరిగితే వెంటనే అధికారులు క్లెయిమ్ చేస్తున్నారు. వారం, పది రోజుల్లోనే రూ.5 లక్షలు పడుతున్నాయి. ఇలాంటి భరోసానే ఇకపై అన్ని కుటుంబాలకు 365 రోజుల పాటు దక్కనున్నది.

గ్రామీణ ప్రాంతాల్లో బీమా తక్కువే

ఓ ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీ ఈ ఏడాది ప్రారంభంలో నిర్వహించిన సర్వే ప్రకారం దేశంలో సగటున ప్రతి పది మందిలో ముగ్గురికి మాత్రమే జీవితబీమా సదుపాయం ఉన్నది. పట్టణ ప్రాంతాల్లో 75 శాతం మంది వరకు లైఫ్ ఇన్సూరెన్స్ కలిగి ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో 20 శాతానికే పరిమితమయ్యారు. అంటే వందకు 80 మంది ఇన్సూరెన్స్‌కు దూరంగా ఉన్నారు. ఇందుకు అవగాహనలేమితోపాటు అనేక కారణాలు ఉన్నాయి. అకస్మాత్తుగా ఆ ఇంటి పెద్ద దూరమైతే కుటుంబాలు రోడ్ల మీద పడుతున్నాయి. మహిళలు పనులకు వెళ్తూనే కుటుంబ భారాన్ని మోయాల్సి వస్తున్నది. వారిపై ఆధారపడిన పిల్లలు చదువులు ఆపేసి, బాలకార్మికులుగా పనుల్లో చేరిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.



బీజేపీ కార్యకర్త కనకయ్య చనిపోతే ఆయన తల్లి గంగవ్వకు ప్రొసీడింగ్స్ పేపర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ (ఫైల్)

బీమా ప్రకటన భరోసానిచ్చింది

రాష్ట్రంలో ప్రతి వ్యక్తికి బీమా సౌకర్యం కల్పిస్తానని ప్రకటించి సీఎం కేసీఆర్ భరోసానిచ్చారు. నిరుపేద ప్రజలకు ఈ ప్రకటన ఎంతో నచ్చింది. సాధారణంగా పేద ప్రజలు బీమా చేసుకునే పరిస్థితి ఉండదు. ఏ రోజుకు ఆ రోజు పూట వెళ్లదీసుకోవడమే కష్టమంటే ఇక బీమా ఎక్కడ? ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా మ్యానిఫెస్టోలో వరాలు ప్రకటించడం కేసీఆర్‌కే చెల్లింది.

- జగిడి రాము, రైతు, లక్ష్మీనగరం, దుమ్ముగూడెం మండలం, భద్రాద్రి జిల్లా

పేద కుటుంబాలకు కొండంత ధైర్యం

నా భర్త పదేండ్ల కిందటే చనిపోయిండు. అప్పుడు మాలాంటి పేదోళ్ల గురించి ఆలోచించే కేసీఆర్ సర్కార్ లేకుండే. ఎవ్వలు కూడా మా కుటుంబాన్ని ఆదుకోలే. నా ఇద్దరి బిడ్డలను నేనే కష్టపడి పెంచి పెద్ద చేసిన. ఉన్న ఎకరం పొలం సాగు చేసుకుంటూ, కూలీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని సాకుతున్నా. గప్పుడే కేసీఆర్ సర్కార్ ఉంటే నా భర్త పేరు మీద రైతు బీమా వచ్చేది. నాకు నా బిడ్డలకు ఆసరా అయ్యేది. కేసీఆర్ సీఎం అయినంక పేదల తలరాతలు మారిపోయినయి. కేసీఆర్ బీమా పథకాన్ని తీసుకొస్తామని కేసీఆర్ ఇచ్చిన హామీ ఎన్నో పేద కుటుంబాలకు ఆసరా అయితది. రూ.5 లక్షల బీమా అంటే మామూలు విషయం కాదు. కొండంత ధైర్యం. నిరుపేదల బాగు కోసం పాటుపడుతున్న కేసీఆర్ సర్కార్ మూడోసారి వస్తది.

- చీర్ల సుగుణ, షట్‌పల్లి, కోటపల్లి మండలం, మంచిర్యాల జిల్లా

బీమాతో పేదోడికి ధీమా

పేదోడికి ఆర్థిక ధీమానిచ్చేలా కేసీఆర్ బీమా పథకం మారనున్నది. ఇన్సూరెన్స్ రంగంలో సుదీర్ఘ అనుభవం, స్వీయానుభవంతో చెప్తున్న విషయమేమింటే ప్రతి కుటుంబానికి తప్పనిసరిగా బీమా ఉండాలి. ఎలాంటి బీమా పథకం లేక కరోనా సమయంలో ఇంటి పెద్ద దిక్కును కోల్పోయినవాళ్లు డబ్బులేక ఇబ్బందులు పడ్డారు. అలా ఆర్థికంగా చితికిపోయిన ఎన్నో కుటుంబాలను కండ్లారా చూశాను. ఇందులో చాలా మంది